# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 09-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు తెలంగాణలో 1,535 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు.

- పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ శాసనసభా పార్టీ నేత సువేందు అధికారి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.

- అత్యాధునికమైన "మిర్వ్" సాంకేతికతతో కూడిన "అగ్ని" క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

- గుజరాత్, పశ్చిమ రాజస్థాన్‌లలో కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు బెంగళూరులో ఆధ్యాత్మిక సంస్థ `ఆర్ట్ ఆఫ్ లివింగ్` 45వ వార్షికోత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరాన్ని ప్రధాని ప్రారంభించనున్నారు. అనంతరం ప్రధానమంత్రి తెలంగాణలో పర్యటిస్తారు. 1,535 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పలు రైల్వే ప్రాజెక్టులను ఆయన జాతికి అంకితం చేయనున్నారు. 118 కిలోమీటర్ల మేర నిర్మించిన కాజీపేట - విజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభించనున్నారు. కాజీపేట జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు నిర్మించిన `రైల్ అండర్ రైల్` (RUR) బైపాస్‌ను కూడా నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవం అనంతరం.. ప్రధాని మోదీ సాయంత్రం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ చేరుకుంటారు. ఈ పర్యటనలో సోమవారం సోమనాథ్ ఆలయ పునరుద్ధరణ 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "సోమనాథ్ అమృత్ మహోత్సవం"లో పాల్గొంటారని ప్రధాని కార్యాలయం (PMO) వెల్లడించింది. సోమనాథ్ క్షేత్ర విశిష్టతను, ఆధ్యాత్మిక వారసత్వాన్ని చాటి చెప్పేలా ప్రత్యేక స్మారక స్టాంపు, నాణాన్ని ప్రధాని విడుదల చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ శాసనసభా పార్టీ నేత సువేందు అధికారి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యమంత్రితో పాటు ఐదుగురు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ప్రజలకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY), అటల్ పెన్షన్ యోజన (APY) పథకాలు విజయవంతంగా 11 ఏళ్లు పూర్తి చేసుకున్నాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. సమాజంలోని అణగారిన, బలహీన వర్గాలకు సైతం తక్కువ ఖర్చుతో కూడిన ఆర్థిక రక్షణను అందించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. పథకాల పురోగతిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతతో ప్రారంభమైన ఈ పథకాలు బీమా, పెన్షన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాయని కొనియాడారు. ఇప్పటివరకు పీఎం జీవన్ జ్యోతి బీమా యోజనలో 27 కోట్లకు పైగా, పీఎం సురక్ష బీమా యోజనలో 58 కోట్ల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అలాగే వృద్ధాప్య భరోసా ఇచ్చే అటల్ పెన్షన్ యోజనలో 9 కోట్ల మంది సభ్యులుగా చేరారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంప్రదాయక సంబంధాలు ఎంతో ఉన్నతమైనవని విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా ఆయన ఈరోజు ట్రినిడాడ్ అండ్ టొబాగోలోని విదేశీ, కారికోమ్ (CARICOM) వ్యవహారాల మంత్రిత్వ శాఖలో నిర్వహించిన పతాకావిష్కరణ కార్యక్రమంలో ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య కేవలం స్నేహమే కాకుండా.. వస్త్రధారణ, క్రీడలు, సంప్రదాయాల విషయంలోనూ ఎంతో సారూప్యత ఉందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

అనంతరం ఆ దేశ ప్రధాని కమలా ప్రసాద్ బిసేసర్‌తో కేంద్రమంత్రి భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కొత్త ప్రాజెక్టులపై వారు చర్చించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

అత్యాధునికమైన మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటెడ్ రీ ఎంట్రీ వెహికల్ (మిర్వ్) సాంకేతికతతో కూడిన `అగ్ని` క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి నిన్న నిర్వహించిన ఈ ప్రయోగం ఆశించిన లక్ష్యాలను చేరుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని భౌగోళిక పరిధిలో.. వేర్వేరు దిశల్లో ఉన్న వివిధ లక్ష్యాలను ఇవి ఏకకాలంలో ఛేదించగలవని ఆ శాఖ తెలిపింది. ఈ ఘనత సాధించిన డీఆర్డీఓ (DRDO) శాస్త్రవేత్తలు, భారత సైన్యం, పారిశ్రామిక భాగస్వాములను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ సవాళ్లు, ముప్పులను ఎదుర్కోవడంలో ఈ క్షిపణి దేశ రక్షణ వ్యవస్థకు బలాన్ని చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

తమిళగ వెట్రి కళగం (TVK) అధినేత సి.జోసెఫ్ విజయ్ ఈరోజు చెన్నైలోని లోక్ భవన్‌లో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన ఎమ్మెల్యేల మద్దతు పత్రాన్ని సమర్పించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచిన TVK ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 234 సభ్యుల అసెంబ్లీలో 118 స్థానాలు అవసరం. ఈ సంఖ్యను చేరుకోవడానికి VCK, IUML నిబంధనలేని మద్దతు ప్రకటించాయి. చెన్నైలో మీడియాతో మాట్లాడిన టీవీకే నేత ఆదవ్ అర్జునా.. ఈ రెండు పార్టీలతో పాటు కాంగ్రెస్, సిపిఐ, సిపిఎంతో కలిపి మొత్తం 13 మంది ఎమ్మెల్యేల మద్దతు లభించిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

గ్రామీణ భారతావని అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉత్తమ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం `జాతీయ పంచాయతీ పురస్కారాలు-2025`ను ప్రకటించింది. దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 42 పంచాయతీలు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. వచ్చే నెల జూన్ 3వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఈరోజు వెల్లడించింది. ఈ ఏడాది అవార్డుల జాబితాలో కర్ణాటక ఆరు పురస్కారాలతో ప్రథమ స్థానంలో నిలవగా.. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలు ఐదేసి అవార్డులతో తర్వాతి స్థానాలను దక్కించుకున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా మారుమూల గ్రామాలను ప్రధాన స్రవంతితో అనుసంధానించే `ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన` (PMGSY) 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ పథకం రజతోత్సవ వేడుకలతో పాటు, నాలుగో విడత PMGSY జాతీయ స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం రేపు మధ్యప్రదేశ్‌లోని సీహోర్ జిల్లా బైరుందాలో జరగనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ బలోపేతం కావడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడంతో పాటు.. విద్య, వైద్యం, వ్యవసాయ మార్కెట్లకు చేరువయ్యే అవకాశం సులభతరం అవుతుందని కేంద్రమంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్-2026 రెండో దశలో భారత అర్చర్ సహిల్ జాధవ్ కాంస్య పతకం సాధించారు. మహారాష్ట్రకు చెందిన 25 ఏళ్ల జాధవ్, డెన్మార్క్ సీనియర్ ఆటగాడు మార్టిన్ డామ్స్‌బోను 147–144 స్కోరుతో ఓడించి.. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన రాజస్థాన్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి ఒక వికెట్ నష్టపోయి 119 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్, పశ్చిమ రాజస్థాన్‌లలో కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ఈ మేరకు పలు ప్రాంతాలకు హెచ్చరికలు జారీ చేసింది. బీహార్‌లో గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తూ.. భారీ ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో అక్కడ రెడ్ అలర్ట్ ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =